రామన్నపేట ప్రెస్ క్లబ్‌కు నూతన కమిటీ



దశ, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట రిజిస్టర్డ్ ప్రెస్ క్లబ్ (134/2020)ను పునరుద్ధరించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తెలుసూరి మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా బత్తుల గణేష్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా కొండ మల్లేశం గౌడ్, గౌరవ సలహాదారులుగా రుద్రాల శ్రీరాములు, కె.వి. సుధాకర్ రాజు, కోశాధికారిగా నడిగోటి నగేష్, ఉపాధ్యక్షులుగా సిర మహేష్, నోముల శంకర్, సహాయ కార్యదర్శిగా ముత్యాల రమేష్, కార్యవర్గ సభ్యులుగా నాగటి యాదయ్య, వీరమల్ల రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు, కార్యదర్శి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రెస్ క్లబ్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

నూతన అధ్యక్షుడు మల్లేశ్‌కు సన్మానం

రామన్నపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా తెలుసూరి మల్లేశ్ ఎన్నికైన సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ బత్తుల ఉమా రమేష్ యాదవ్ తన మిత్రబృందంతో కలిసి ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పబ్బు ధనుంజయ గౌడ్, గోగు మధు యాదవ్, గోగు సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రేమ పేరుతో వేధింపులు.. యువతి బలవన్మరణం



దశ, హైదరాబాద్: హైదరాబాద్‌లోని రామంతాపూర్ ఇందిరానగర్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్రియుడి వేధింపులు భరించలేక గండమళ్ల చందన (23) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మేడిపల్లిలోని ఓ కంటి ఆసుపత్రిలో పనిచేస్తున్న చందనకు అదే ఆసుపత్రిలో పనిచేసే తుడుము శివ (23)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. గత ఏడాదిన్నరగా ప్రేమలో ఉన్న వీరి మధ్య ఇటీవల మనస్పర్థలు తలెత్తినట్లు సమాచారం. శివ తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఈ నెల 21న చందన తన అక్కకు చెప్పినట్లు తెలిసింది. మరుసటి రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి ఖర్చుల కోసం చైన్ స్నాచింగ్

వృద్ధురాలి మెడలో నుంచి 3 తులాల బంగారు గొలుసు చోరీ



దశ, హైదరాబాద్: పెళ్లి ఖర్చుల కోసం చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ప్రేమజంటను వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేశారు. వనస్థలిపురం పరిధిలోని రాజరాజేశ్వరి దేవాలయంలో ఉన్న ఓ వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకున్న నిందితులు.. ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల సాయంతో నిందితులను 24 గంటల్లోనే కమలానగర్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి చోరీకి గురైన బంగారు గొలుసుతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పెళ్లి ఖర్చుల కోసం చోరీ చేసినట్లు నిందితులు వెల్లడించారని పోలీసులు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

అభివృద్ధి పనులకు సహకరించాలని ఎంపీకి కాంగ్రెస్ నాయకుల వినతి



దశ, పెద్దఅంబర్‌పేట్: నాగోల్ సర్కిల్ పరిధిలోని తట్టి అన్నారం, మరిపెల్లి, ఆర్కే నగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరించాలని కోరుతూ స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని కలిశారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ సహకరించాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లెపాక మల్లేష్, చంద్రగోని గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు కోసం నమోదు చేసుకోండి

ఫారం–18 సమర్పణకు నవంబర్ 6 చివరి తేదీ

దశ, రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. 2026 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తిచేసి మూడేళ్లు నిండిన అర్హులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో ceotelangana.nic.in వెబ్‌సైట్ ద్వారా లేదా సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉండే ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అవసరమైన విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను జతచేసి సంబంధిత అధికారులకు సమర్పించాలి. ఫారం-18 సమర్పించేందుకు 2026 నవంబర్ 6 చివరి తేదీ అని అధికారులు తెలిపారు. అర్హులైన పట్టభద్రులు గడువులోగా పేర్లు నమోదు చేసుకుని, తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వీట్ షాపులపై ఫుడ్ సేఫ్టీ దాడులు..

- *1,035 కిలోల సరుకు స్వాధీనం*
- *రూ.7.75 లక్షల విలువైన ఆహార పదార్థాలు సీజ్.. మూడు సంస్థల లైసెన్సులు సస్పెండ్*



దశ, హైదరాబాద్: స్వీట్ల తయారీ, విక్రయ కేంద్రాల్లో ఆహార భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలను గుర్తించేందుకు తెలంగాణ ఫుడ్ సేఫ్టీ విభాగం (TG SAFE) ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో 21 స్వీట్ యూనిట్లను 11 తనిఖీ బృందాలు పరిశీలించాయి. ఈ తనిఖీల్లో 21 ఆహార నమూనాలను సేకరించడంతోపాటు, అనుమానాస్పదంగా గుర్తించిన 1,035 కిలోల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.7,75,850గా అధికారులు వెల్లడించారు.

తనిఖీల్లో పలు సంస్థల్లో పరిశుభ్రత లోపాలు, ఆహార పదార్థాల నిల్వలో నిర్లక్ష్యం, గడువు ముగిసిన ఉత్పత్తులు, లేబులింగ్ సమస్యలు గుర్తించినట్లు ఫుడ్ వింగ్ పేర్కొంది. నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో మూడు సంస్థల లైసెన్సులను సస్పెండ్ చేయగా, ఏడు సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరో ఆరు సంస్థలకు మెరుగుదల నోటీసులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

మూడు సంస్థల లైసెన్సులు సస్పెండ్

ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి వాసిరెడ్డి స్వగృహ ఫుడ్స్ (ప్రశాంత్ నగర్, కూకట్‌పల్లి), మధుర్ స్వీట్స్ (హుమాయూన్ నగర్, మాసబ్ ట్యాంక్), బి. బిచా రెడ్డి స్వీట్స్ (చందానగర్) సంస్థల లైసెన్సులను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ సంస్థల కార్యకలాపాలను నిలిపివేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

ఏడు సంస్థలకు షోకాజ్ నోటీసులు

తనిఖీల్లో గుర్తించిన లోపాలపై వివరణ కోరుతూ హనీ ఫుడ్స్ (గుండ్లపోచంపల్లి), హర్ష ఎంటర్‌ప్రైజెస్ (స్వీట్ బాస్కెట్), ఆల్మండ్ హౌస్ ప్రైవేట్ లిమిటెడ్, దడుస్ మిఠాయి వటికా, రాజీవ్ రెడ్డి స్వీట్స్, పరుచూరి ఫుడ్స్, సుదర్శన్ రెడ్డి ప్యూర్ నెయ్యి స్వీట్స్ సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

తార్నాకలోని సుదర్శన్ రెడ్డి ప్యూర్ నెయ్యి స్వీట్స్ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పరిశుభ్రతకు సంబంధించిన లోపాలు కూడా ఉన్నట్లు పేర్కొంటూ సంస్థను మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరు సంస్థలకు మెరుగుదల నోటీసులు

పరిశుభ్రత, ఆహార నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని ఆదేశిస్తూ మరో ఆరు సంస్థలకు మెరుగుదల నోటీసులు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో మీతే మియా (బంజారాహిల్స్), మెజెస్టిక్ స్వీట్స్ (టోలిచౌకి), శివ నాగి రెడ్డి స్వీట్స్ (జీడిమెట్ల), గోదావరి వంటిల్లు (వెంగళరావు నగర్), శుభం హోమ్ ఫుడ్స్, ప్రమదాస్ స్వీట్స్, హాట్స్ అండ్ పికిల్స్ (ఇందిరా పార్క్) ఉన్నాయి. సంబంధిత సంస్థలు లోపాలను సరిదిద్దిన తర్వాత తిరిగి తనిఖీలు నిర్వహించి నిబంధనల అమలును పరిశీలించనున్నారు.

అపరిశుభ్రత, నిల్వలో నిర్లక్ష్యం

తనిఖీల సందర్భంగా కొన్ని సంస్థల్లో ఆహార పదార్థాలపై ఈగలు, బొద్దింకలు, ఎలుకలు వంటి కీటకాల సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు ప్రకటనలో వెల్లడించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు, తప్పుగా లేబులింగ్ చేసిన ఉత్పత్తులు, సరైన పద్ధతిలో నిల్వ చేయని పదార్థాలు ఉన్నట్లు పేర్కొన్నారు. కొన్ని చోట్ల గోడలు అపరిశుభ్రంగా ఉండటం, నేలలు దెబ్బతినడం, ఆహార వ్యర్థాలతో డ్రైనేజీలు మూసుకుపోవడం, ఎగ్జాస్ట్ వ్యవస్థల్లో జిడ్డు పేరుకుపోవడం వంటి లోపాలు కనిపించాయి.

అలాగే స్వీట్లను కప్పి ఉంచేందుకు అపరిశుభ్రమైన వస్త్రాలు, వార్తాపత్రికలు ఉపయోగించడం, కొందరు ఆహార నిర్వాహకులు హెయిర్ నెట్స్, గ్లౌజులు ధరించకపోవడం, తప్పనిసరిగా నిర్వహించాల్సిన రికార్డులు అందుబాటులో లేకపోవడం వంటి ఉల్లంఘనలను గుర్తించినట్లు ఫుడ్ వింగ్ వివరించింది.

తనిఖీల్లో పరిశీలించిన 21 సంస్థలు

హనీ ఫుడ్స్, మీతే మియా, మెజెస్టిక్ స్వీట్స్, వాసిరెడ్డి స్వగృహ ఫుడ్స్, అభిరుచి స్వగృహ ఫుడ్స్, హర్ష ఎంటర్‌ప్రైజెస్ (స్వీట్ బాస్కెట్), ఆల్మండ్ హౌస్ ప్రైవేట్ లిమిటెడ్, దడుస్ మిఠాయి వటికా, మధుర్ స్వీట్స్, రాజీవ్ రెడ్డి స్వీట్స్, శివ నాగి రెడ్డి స్వీట్స్, పరుచూరి ఫుడ్స్, గోదావరి వంటిల్లు, శుభం హోమ్ ఫుడ్స్, ప్రమదాస్ స్వీట్స్ అండ్ హాట్స్ అండ్ పికిల్స్, రవితేజ హోమ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బి. బిచా రెడ్డి స్వీట్స్, సుదర్శన్ రెడ్డి ప్యూర్ నెయ్యి స్వీట్స్, బాలాజీ రతన్‌లాల్ స్వీట్ షాప్, శ్రీజ హోమ్ ఫుడ్స్, కాకర్ల స్వగృహ ఫుడ్స్ సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు.

దబిల్‌గూడలో ఆర్థిక సమ్మిళిత పథకాల ప్రచారం ప్రారంభం



- *బ్యాంకింగ్ సేవలపై అవగాహన.. బీమా, పెన్షన్ పథకాలపై వివరాలు*

దశ, రంగారెడ్డి : తెలంగాణ రాష్ట్రవ్యాప్త ఆర్థిక సమ్మిళిత పథకాల ప్రచారాన్ని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం దబిల్‌గూడ గ్రామ పంచాయతీలో శుక్రవారం ప్రారంభించారు. అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 31 వరకు జరిగే ఈ ప్రచారంలో భాగంగా తెలంగాణ ఎస్ఎల్‌బీసీ ఆధ్వర్యంలో రంగారెడ్డి లీడ్ బ్యాంక్, ఎస్‌బీఐ అమీర్‌పేట శాఖ సంయుక్తంగా శిబిరాన్ని నిర్వహించాయి. కార్యక్రమానికి ఆర్‌బీఐ హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకులు చిన్మయ్ కుమార్ ముఖ్య అతిథిగా, ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఎస్‌బీఐ జనరల్ మేనేజర్, తెలంగాణ ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ సతీష్ కుమార్ ప్రచార లక్ష్యాలను, శిబిరాల ద్వారా అందించే బ్యాంకింగ్ సేవలను వివరించారు. ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ జ్ఞాన సుప్రభాత్ ఎం. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల ప్రయోజనాలను వివరించారు. ఖాతాదారులు రీకేవైసీ పూర్తి చేయడంతోపాటు నామినీ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎల్. శ్రీలత ప్రచారానికి జిల్లా యంత్రాంగం తరపున సహకారం అందిస్తామని తెలిపారు. సుమారు 500 మంది పాల్గొన్న ఈ శిబిరంలో వివిధ బ్యాంకులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాయి. ఆర్థిక సమ్మిళిత పథకాలు, రీకేవైసీ, నామినేషన్లు, క్లెయిమ్ చేయని డిపాజిట్లపై సేవలు అందించడంతోపాటు సైబర్ మోసాల నివారణపై అవగాహన కల్పించారు. నాబార్డు, పలు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల అధికారులు, దబిల్‌గూడ సర్పంచ్ యాదమ్మ, ఉప సర్పంచ్ అర్చన పాల్గొన్నారు. శిబిరాన్ని రంగారెడ్డి జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్‌కుమార్ కేపీ సమన్వయం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించాలి



- *ప్రమాద ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలి: అదనపు కలెక్టర్ కిరణ్మయి*

దశ, రంగారెడ్డి : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేసేలా తనిఖీలు నిర్వహించాలని, అవసరమైన చోట అదనపు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రోడ్డు భద్రతకు అవసరమైన పనులపై ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. వాహనదారులు వేగ పరిమితులు పాటిస్తూ, రాంగ్ రూట్‌లో వెళ్లకుండా అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు.

పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పాదచారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు తెలిపారు. పోలీసులు, ట్రాఫిక్, రవాణా, ఆర్టీసీ, జాతీయ రహదారులు, రోడ్లు భవనాల శాఖ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కిరణ్మయి అన్నారు. జిల్లాను రోడ్డు ప్రమాదాలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజలకు అవగాహన కల్పించిన సీఐ మెరుగు రవి, ఎస్సై గోపాతి సతీష్



దశ, రామన్నపేట: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని రామన్నపేట సీఐ మెరుగు రవి, ఎస్సై గోపాతి సతీష్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట పట్టణంలో ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా నేరాల నియంత్రణతోపాటు ఘటనలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దొంతి కాంతమ్మ గారి సంవత్సరికంలో పాల్గొని నివాళులర్పించిన పెండెం రామానంద్



దశ, నర్సంపేట: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మ గారి మొదటి సంవత్సరికం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ, కౌన్సిలర్లు బత్తిని రాజేందర్, మాదాసి రవి, కొత్తకొండ మేఘన శ్యామ్ రాజ్, బాణాల ప్రసన్న శ్రీనివాస్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి సందీప్, కోనాపురం సర్పంచ్ మైదం రాకేష్, పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి చిప్ప నాగ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంత రంజిత్, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కల్వకుంట్ల రమేష్ రావు వర్ధంతి వేడుకలు

కొవ్వతులతో నివాళులు అర్పించిన నాయకులు గ్రామస్థులు

దశ, వెల్గటూర్: వెల్గటూర్ మండల కేంద్రంలో కల్వకుంట్ల రమేష్ రావు వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం సాయంత్రం , గ్రామ సర్పంచ్ బండమీది కవిత గోపి ఆధ్వర్యంలో .. వెల్గటూర్ మాజీ సింగిల్ విండో ఛైర్మెన్ కీ. శే కల్వకుంట్ల రమేష్ రావు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు వెల్గటూర్ మండల నాయకులు , ప్రజా ప్రతినిధులు , యువజన సంఘాలు, గ్రామస్థులు హాజరై రమేష్ రావు కు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కవిత గోపి లు మాట్లాడుతూ... గ్రామానికి రమేష్ రావు చేసిన సేవలు చిరస్మరణీయం అని అన్నారు. రైతులకు సహకార సంఘాల ద్వారా రుణాలను అందించడం ఎల్లప్పుడూ రైతులకు సేవ చేసిన నాయకుడు అని పేర్కొన్నారు. వారి భార్య శ్రీలత సర్పంచిగా మంచినీటి బావి , డ్రైనేజీ, సీసీ రోడ్లు ఇతరత్ర అభివృద్ధి పనులు చేస్తూ నిస్వార్థంగా పని చేసిన ఏకైక నాయకుడు అని తెలిపారు. విభేదాలకు తావు ఇవ్వకుండా సేవ చేసి న నాయకుడు అని కొనియాడారు. మరణించి నేటికి 19 ఏళ్ళు గడుస్తున్న , గ్రామ ప్రజల హృదయాల్లో ఎప్పుడూ వారు ఉంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని కుల సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు కందిపప్పు దేశానికే తలమానికం

- డిజిటల్ వేదికపై తాండూరు కందిపప్పు
- త్వరలో డిజిటల్ ట్రేసబిలిటీ వ్యవస్థ అందుబాటు
- ఇప్పటికే టీజీటీఎస్ గుర్తింపు
- నకిలీ తాండూరు కందిపప్పును గుర్తించడం ఈజీ
- భౌగోళిక గుర్తింపు పొందిన తొలి వ్యవసాయ ఉత్పత్తి
- 65 వేలమంది డిజిటల్ వేదికపై రైతులు



దశ,తాండూర్ ప్రతినిధి: తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన తాండూరు కందిపప్పునకు 'డిజిటల్ ట్రేసబిలిటీ' వ్యవస్థ అందుబాటులోకి రానుంది. భౌగోళిక గుర్తింపు(జీఐ) పొందిన తాండూరు కందిపప్పు అసలైన ఉత్పత్తిని గుర్తించటంతోపాటు నకిలీల విక్రయాలకు అడ్డుకట్ట వేయటం, రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ ఈ ప్రాజెక్టు చేపట్టింది. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీజీటీఎస్) ద్వారా హైదరాబాద్‌కు చెందిన ట్రేసబిలిటీ, డిజిటల్ మౌలిక సదుపాయాల సంస్థ 'టీఆర్‌వేస్‌టీ01'కు బాధ్యతలు అప్పగిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది.

కేంద్ర ప్రభుత్వ 'నేషనల్ ఈగవర్నెన్స్ ప్లాన్ ఇన్ అగ్రికల్చర్ (ఎన్ఈజీపీఏ 202526)' పరిధిలో ఈ కార్యక్రమం అమలు చేయనున్నారు. తాండూరు కందిపప్పు సాగుచేసే నిర్దేశిత ప్రాంతంలోని సుమారు 65 వేల మంది రైతులను డిజిటల్ వేదికపై నమోదు చేస్తారు. ప్రతి రైతుకు ప్రత్యేక డిజిటల్ గుర్తింపుతోపాటు వారి భూమి, సాగుచేసిన పంట, పంటకోత వివరాలతో ప్రొఫైల్ రూపొందిస్తారు. తద్వారా పంటను ఎవరు పండించారు? ఎక్కడ పండించారు? అనే వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. పంట సాగు చేసిన పొలం నుంచి సేకరణ, ప్రాసెసింగ్, పంపిణీ, చివరకు కొనుగోలుదారుడికి చేరేవరకు తాండూరు కందిపప్పు ప్రయాణాన్ని డిజిటల్ వ్యవస్థ ద్వారా నమోదు చేస్తారు.

ఇప్పటివరకు వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిన తర్వాత పంటను పండించిన రైతుల వివరాలు గుర్తించలేని పరిస్థితి ఉంది. కొత్త విధానంలో ప్రతి సరుకు లాట్‌కు సంబంధించిన అసలు వివరాలను గుర్తించే అవకాశం ఉంటుంది. దీంతో రైతులకు తమ ఉత్పత్తిపై గుర్తింపు లభించటంతోపాటు మార్కెట్‌లో బేరసారాల సామర్థ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. వ్యవసాయ రంగంలో మహిళా రైతుల భాగస్వామ్యాన్ని గుర్తించి ప్రోత్సహించడానికి ఈ వ్యవస్థ దోహదపడుతుంది. నకిలీ తాండూరు కందిపప్పును గుర్తించే అవకాశం ఉంటుంది. తాండూరు ప్రాంతానికి సంబంధించిన నమోదిత జీఐ భౌగోళిక పరిధిలో సాగుచేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు.

వ్యవసాయ భూముల మ్యాపింగ్ చేపట్టి, నమోదిత రైతులు, సాగు విస్తీర్ణం, పంటల వివరాలు జీఐ పరిధితో పోలుస్తారు. నిర్దేశిత ప్రాంతంలో పండించిన, ధ్రువీకరించిన ఉత్పత్తికే తాండూరు మూలానికి సంబంధించిన గుర్తింపు లభించేలా వ్యవస్థను రూపొందించనున్నారు. దీంతో ఇతర ప్రాంతాల్లో పండించిన కందిపప్పును తాండూరు పేరుతో విక్రయించే అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని భావిస్తున్నారు. తాండూరు కందిపప్పు తెలంగాణలో భౌగోళిక గుర్తింపు పొందిన తొలి వ్యవసాయ ఉత్పత్తి కావడం తెలిసిందే. 2022 డిసెంబరులో జీఐ గుర్తింపు లభించింది. యాలాల ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఈ గుర్తింపు కోసం దరఖాస్తుచేయగా, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారం అందించింది.

బీసీఏ కులాల హక్కులకు భంగం కలిగిస్తే సహించం

ముదిరాజులను బీసీ-ఏలో చేర్చే ప్రయత్నాన్ని విరమించుకోవాలి



దశ, నర్సంపేట: బీసీఏ కేటగిరీలోని 57 కులాల హక్కులు, ప్రయోజనాలకు నష్టం కలిగించే నిర్ణయాలను సహించబోమని నర్సంపేట పట్టణ రజక సంఘం అధ్యక్షుడు కొల్లూరు లక్ష్మీనారాయణ, కార్యదర్శి తడిగొప్పుల రవి స్పష్టం చేశారు. ముదిరాజులను బీసీఏ కేటగిరీలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని వారు ఖండించారు. ఈ అంశంపై శుక్రవారం నర్సంపేట పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బీసీఏ కేటగిరీలో ఇప్పటికే ఉన్న 57 కులాల హక్కులు, ప్రయోజనాలకు భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ కేటగిరీలో ఉన్న కులాలకు అన్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. ప్రభుత్వం ఈ అంశంపై పునరాలోచించి, బీసీఏ కులాల ప్రయోజనాలను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ హక్కులకు నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం విరమించుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా బీసీఏ కులాల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రజక సంఘం గౌరవ అధ్యక్షుడు ఐలోని శ్రీనివాస్‌తో పాటు కొల్లూరి శ్రీహరి, రాయరాకుల శ్రీనివాస్, ఉప్పుల పరమేష్, కొల్లూరు భాస్కర్, గుడికందుల సదానందం, వాయిల మల్లయ్య, కొల్లూరి రాజు, గడ్డమీద బాలకృష్ణ, వాయిల్లా నరసయ్య, రాజేందర్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన గొల్ల జానయ్యకు మార్కెట్ కమిటీ చైర్మన్ పరామర్శ

బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన.



దశ సూర్యాపేట ప్రతినిధి : సూర్యాపేట మండలం బాలెంల స్టేజి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గొల్ల జానయ్యను స్థానిక ఏరియా హాస్పిటల్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పరామర్శించారు. సందర్భంగా బాధితుడికి అందిస్తున్న వైద్య చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జానయ్య ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని కోరారు. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు అండగా నిలవడం, ఆపద సమయంలో బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పడం ప్రజాసేవలో భాగమని కొప్పుల వేణారెడ్డి చాటిచెప్పారు. వారి వెంట మున్సిపల్ కౌన్సిలర్ బైరు శైలేందర్, గ్రామ శాఖ అధ్యక్షులు పులగం వెంకట్ రెడ్డి, ఆరెగూడెం ఉపసర్పంచ్ గొల్ల వెంకన్న, మాజీ జెడ్పిటిసి అవిలయ్య, బాలెంల మాజీ సర్పంచ్ రామసాని రమేష్, దాస్ తండా మాజీ సర్పంచ్ మోతిలాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మిద్దె రమేష్, మోదాల ముత్తయ్య తదితరులు ఉన్నారు.



గొల్లగట్టు (పెద్దగట్టు) జాతరకు అధిక నిధులు కేటాయించాలి

బీసీ విద్యార్థి సంఘం నేత లింగయ్య యాదవ్ డిమాండ్

దశ సూర్యాపేట ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద గొల్ల గట్టు (పెద్దగట్టు) అధిక నిధులు కేటాయించాలని బీసీ విద్యార్థి జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్ తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక లింగమంతుల స్వామి గుట్ట ను సందర్శించి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగే జాతరకు అధిక నిధులు కేటాయించి గుట్టను అభివృద్ధి చేయాలి, అదేవిధంగా గుట్టకు సంబంధించిన భూములను ప్రభుత్వ అధికారులు సర్వే చేయించి హద్దులను గుర్తించాలి .శాశ్వత పాలకమండలని తక్షణమే ఏర్పాటు చేయాలి పర్మినెంట్ సౌకర్యాలను కల్పించాలి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం .గొల్ల గట్టు జాతర పట్ల అశ్రద్ధ వహిస్తే ముఖ్యమంత్రి ఇంటినీ లక్షలాది మందితో ముట్టడిస్తాం మని హెచ్చరించారు.

ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్

- ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి.
- కేసుల దర్యాప్తులో నాణ్యత, నేరస్థులకు శిక్షలు పడేలా కృషి చేయాలి



దశ సూర్యాపేట ప్రతినిధి : ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌ను సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రికవరీలో ఉన్న వాహనాలు, కేసులకు సంబంధించిన సామగ్రిని పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను తనిఖీ చేయడంతో పాటు, వివిధ రకాల రికార్డులు, కేసు దస్త్రాలు, కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. పోలీస్ సిబ్బంది పనితీరు, సామర్థ్యం, శిక్షణ తదితర అంశాలపై సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రతి పౌరుడికి రక్షణ కల్పించడం పోలీసుల ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ, నేరస్థులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడేలా నాణ్యమైన ఆధారాలను సేకరించి దర్యాప్తు చేయాలని సూచించారు. నేరాల నియంత్రణకు నిరంతర గస్తీ, పటిష్టమైన నిఘా....* పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలను సమర్థవంతంగా అరికట్టాలని, నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ గస్తీని ముమ్మరం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ స్థానిక పరిస్థితులు, సమస్యలు, నేరాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల నివారణతో పాటు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించే వరకు దశలవారీ ఉద్యమాలు

దశ సూర్యాపేట ప్రతినిధి: సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సూర్యాపేట నల్లాల బావి సెంటర్‌లో జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కెవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూట గోపి, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మధ్వల జ్యోతి, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకన్న మాట్లాడుతూ ఓట్ల తొలగింపుతో ప్రజాస్వామ్యానికి నష్టం జరుగుతోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి, నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దేశ రక్షణ.. ధర్మ పరిరక్షణే లక్ష్యం

- హిందూ ధర్మచక్రం వ్యవస్థాపకులు శ్రీకాంత్ శర్మ
- దేశ శాంతి, సౌభాగ్యాల కోసం యాగం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు

దశ ఓయూ: దేశ రక్షణ,ధర్మపరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని హిందూ ధర్మచక్రం వ్యవస్థాపకులు మద్దికుంట్ల శ్రీకాంత్ శర్మ అన్నారు.ప్రపంచ దేశాల్లో భారతదేశం శ్రేష్ఠమైనదని, అన్ని ధర్మాల్లో హిందూ ధర్మం విశిష్టమైనదని పేర్కొన్నారు. ఇలాంటి గొప్ప దేశంలో, ఉన్నతమైన ధర్మంలో జన్మించడం అదృష్టమని తెలిపారు. నాచారం మల్లాపూర్‌లోని వివిఎఆర్ గార్డెన్స్‌లో హిందూ ధర్మచక్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల దేశ రక్షణ - ధర్మ రక్షణ యాగం సందర్భంగా ఆయన మాట్లాడారు.

ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ సూచనల మేరకు మూడు రోజులపాటు వివిధ హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీకాంత్ శర్మ తెలిపారు. గణపతి హోమం, రుద్ర హోమం, సుదర్శన హోమం, చండీ హోమంతోపాటు లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామ పారాయణాలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు వివరించారు. రంగీ సత్యనారాయణ శాస్త్రి ప్రవచనం, శ్రీ మాధవానంద స్వామి అనుగ్రహ భాషణం,పుష్పగిరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతి స్వామివారి అనుగ్రహ సందేశంతోపాటు ప్రముఖ ఆధ్యాత్మికవేత్తల సందేశాలు కార్యక్రమంలో ఉంటాయని వెల్లడించారు. దేశానికి, ధర్మానికి విధేయతతో ఉంటూ వాటి రక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

దేశంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలి

దేశ రక్షణ, ధర్మ పరిరక్షణతోపాటు దేశంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ యాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విదేశీ శక్తుల కుట్రలను ఎదుర్కొనే శక్తి దేశానికి కలగాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో దేశాన్ని పాలించాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి తన కుటుంబ సభ్యులతో కలిసి యాగ నిర్వహణలో పాల్గొన్నారు. దేశ క్షేమం, ధర్మ పరిరక్షణను కాంక్షిస్తూ మూడు రోజులపాటు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా బోధన సాగాలి



- ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సులోచన రాణి సూచనలు.

దశ సూర్యాపేట ప్రతినిధి : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, రాబోయే ఇంటర్మీడియట్ పరీక్షల్లో గత ఏడాది కంటే మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సులోచన రాణి సూచించారు. శుక్రవారం అకాడమిక్ తనిఖీలో భాగంగా సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపల్ పెరుమాళ్ల యాదయ్య అధ్యక్షతన కళాశాలను సందర్శించి,కళాశాలలో విద్యా కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. హాజరు నమోదును పకడ్బందీగా నిర్వహించడంతో పాటు, అధ్యాపకుల బోధనా ప్రణాళికలు, రోజువారీ విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. గత ఏడాది విద్యా ఫలితాలను సమీక్షించి, ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల అభ్యసన ప్రగతిపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారి స్థాయికి అనుగుణంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. పాఠ్యాంశాల పునశ్చరణ, నమూనా ప్రశ్నపత్రాల సాధనకు తగిన సమయం కేటాయించి, విద్యార్థులు పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. కళాశాల ప్రయోగశాలలను క్రమం తప్పకుండా పర్యవేక్షించి, విద్యార్థులకు ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని అందించాలని తెలిపారు. వృత్తి విద్యా కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు సిద్ధాంత బోధనతో పాటు ప్రాయోగిక శిక్షణను సమర్థవంతంగా అందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని సులోచన రాణి అన్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, వారిలో అభ్యసన ఆసక్తిని పెంపొందిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యా ప్రమాణాల పెంపు, ఉత్తీర్ణత మెరుగుదల లక్ష్యంగా అధ్యాపకులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

భూ అక్రమాలపై కలెక్టర్ కఠిన చర్యలు

తేజస్ నంద్ లాల్ పవార్ ఉత్తర్వులు

దశ, హుజూర్‌నగర్: భూముల లావాదేవీల్లో తీవ్ర అవకతవకలు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంపై సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కఠిన చర్యలు తీసుకున్నారు. హుజూర్ నగర్ తహసీల్దార్ బండ కవిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాశీం షరీఫ్, గ్రామ పాలన అధికారి (జీపీవో) ఎస్.కె. జానీ పాషాలను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాపరమైన విచారణ పెండింగ్‌లో ఉండగానే ఈ చర్యలు చేపట్టారు.

రికార్డులు పరిశీలించకుండానే లావాదేవీలు

హుజూర్‌నగర్ గ్రామం, మండల పరిధిలోని సర్వే నంబర్లు 458, 281లో భూముల లావాదేవీలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. హుజూర్‌నగర్ ఆర్డీవో సమర్పించిన నివేదికల ఆధారంగా ఈ వ్యవహారాన్ని జిల్లా యంత్రాంగం తీవ్రంగా పరిగణించింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పీ) సాగునీటి కాలువలకు సంబంధించిన భూములు, భూసంస్కరణల చట్టం పరిధిలోని భూముల విషయంలో పాత రెవెన్యూ రికార్డులు, గతంలో జరిగిన విచారణలు, న్యాయస్థానాల ఉత్తర్వులను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు.